ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, మే 25 : పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం సీఎం సహాయ నిధి పథకం ప్రవేశపెట్టిందని దీనిని పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో మల్దకల్ మండలంలోని బిజ్వారం గ్రామానికి చెందిన గోవర్ధన్ మెరుగైన వైద్య సాయం కోసం ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.లక్షా50వేల ఎల్‌వోసీని బాధిత కుటుంబసభ్యులకు శనివారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు వైద్యం చేయించుకోవడానికి ఇబ్బందులు పడుతున్న వారు సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో మల్దకల్ ఎంపీపీ రాజారెడ్డి, నాయకులు భాస్కర్, తిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

విజయవర్ధనే ఆయిల్ మిల్లు సందర్శన

ఇటిక్యాల మే 25: బీచుపల్లి విజయవర్ధనే ఆయిల్ మిల్లును శనివారం ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆయిల్ మిల్ ప్రాంగణంలో మొట్టమొదటగా సాగుచేపట్టిన పామాయిల్ చెట్లను పరిశీలించారు. రైతులకు పామాయిల్ మొక్కల సరఫరా, ఇంతవరకు సాగుచేసిన పంటవివరాలు, సాగుచేసిన పామాయిల్ తోటలు ఏవిధంగా ఉన్నాయి, నూతనంగా సాగు చేపట్టేందుకు రైతుల నుంచి స్పందన ఎలా ఉందనే విషయాలను ఆయిల్ మిల్ అసిస్టెంట్ మేనేజర్ వెంకటేశ్‌ను అడిగి తెలుసుకొన్నారు. అలాగే మిల్ పుణరుద్ధరణకు రూ.150కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. జూన్‌లో రాష్ట్ర బడ్జెట్ రివ్యూ సమావేశ అనంతరం నిధులు విడుదలవుతాయన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

● అదనపు కలెక్టర్ ఎం.నగేశ్

వనపర్తి, మే 25 : జూన్ 4న నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజవవర్గ ఎన్నికల కౌంటింగ్ సజావుగా నిర్వహించేందకు అధికారులకు మొదటి స్థాయి శిక్షణ అందించామని అదనపు కలెక్టర్ ఎం.నగేశ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆదేశాల మేరకు వనపర్తి నియోజకవర్గం కౌంటింగ్ అధికారులకు మాస్టర్ ట్రైనర్లతో నిర్వహించిన మొదటి స్థాయి శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బంది తమ కౌంటింగ్ బాధ్యతలు నిబంధనలకు అనుగుణంగా నిర్వర్తించాలని, కౌంటింగ్‌లో సిబ్బంది పాటించాల్సిన నియమాలు, కౌంటింగ్ చేసే విధానంపై మాస్టర్ ట్రైనర్లు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్, రమేశ్‌రెడ్డి, కిషన్‌నాయక్ కౌంటింగ్ అధికారులు ప్రాజెక్టర్ ద్వారా శిక్షణ అందించారు. కార్యక్రమంలో ఈవీఎం నోడల్ అధికారి పూర్ణచందర్, టేబుల్ సూపర్‌వైజర్లు, సహాయకులు, కౌంటింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పనులను త్వరితగతిన పూర్తి చేయించాలి

● జోగుళాంబ గద్వాల అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్

మునుగాలలో పనులపై ఆరాతీస్తున్న అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్

ఇటిక్యాల, మే 25: ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతుల కోసం చేపట్టిన అమ్మ-ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా పనులు త్వరితగతిన పూర్తయ్యేలా కృషిచేయాలని అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ ఎంపీడీవో, ఎంఈవోను ఆదేశించారు. ఇటిక్యాల, మునుగాలలోని ప్రభుత్వ బడుల్లో చేపట్టిన పనులను అదనపు కలెక్టర శనివారం పరిశీలించారు. పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, టాయిలెట్స్ తదితర పనులను జూన్ 10వతేదీ గడువుగా నిర్దేశించుకొని పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహమ్మద్ అజర్ మొహియొద్దీన్, ఎంఈవో రాజు, ఎంపీవో భాస్కర్, జీహెచ్‌ఎం అమీర్‌పాషా ఉన్నారు.

వనపర్తి వాసికి డాక్టరేట్

వనపర్తి టౌన్, మే 25 : వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన మల్లికార్జున్‌కు జేఎన్‌టీయూ హైదరాబాద్ పరిశోధన విభాగం వారు శనివారం డాక్టరేట్‌ను ప్రకటించింది. ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మల్లికార్జున్ 'సింథసిస్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ నానోకాంపోసైట్ పాలిమర్ ఎలక్ట్రోలైట్' అనే అంశంపై పరిశోధనలను ప్రొఫెసర్ జె.శివశంకర్ జేఎన్‌టీయూ పర్యవేక్షణలో పూర్తిచేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉన్న మల్లికార్జున్ డాక్టరేట్ అవార్డు అందుకోవడంపై వనపర్తి ప్రభుత్వ ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు మల్లికార్జున్‌కు అభినందనలు తెలిపారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

గోపాల్‌పేట, మే 25 : పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన మహిళ దవాఖానలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన రేవల్లి మండలకేంద్రంలో చోటు చేసుకున్నది. ఎస్సై తిరుపతిరెడ్డి కథనం మేరకు..మండల కేంద్రానికి చెందిన తెప్ప బంగారమ్మ (43) భర్త వెంకటస్వామి తరుచూ గొడవ పడేవారు. ఈనెల 24న భార్యాభర్తలు కూలి డబ్బుల విషయమై గొడవ పడ్డారు. భర్త వెంకట స్వామి డబ్బులు లేవని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రి 9 గంటలకు తిరిగి వచ్చాడు. భర్త మాటలకు తీవ్ర మనస్తాపానికి గురైన బంగారమ్మ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఇంటికి వచ్చిన భర్తతో తను పురుగుల మందు తాగినట్లు చెప్పగా, అతడు హుటాహుటిన ఆమెను రేవల్లి ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లాడు. పరిస్థితి విషమించడంతో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున ఆమె మృతి చెందింది. మృతురాలు కొడుకు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించి, కుటుంబ సభ్యులు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

పొట్టేళ్ల పందెం

ఉండవెల్లి, మే 25: మండలంలోని తక్కశిలలో ఉమా రామలింగేశ్వర స్వామి జాతర సందర్భంగా పొట్టేళ్ల పందెం నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పొట్టేలు పందెంలో పాల్గొన్నాయి. పోటీలను తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. దీంతో గ్రామంలో సందడి నెలకొన్నది.

రాత్రంతా విద్యుత్ సరఫరాకు అంతరాయం

గట్టు, మే 25 : ఓ మోస్తరు వర్షానికి తోడు గాలులు తోడై సాంకేతిక సమస్యలు తలెత్తి విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో ప్రజలు తల్లడిల్లిపోయారు. శుక్రవారం సాయంత్రం 5.34ని.లకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. రాత్రి 11.13ని.లకు సరఫరా ప్రారంభమైంది. మళ్లీ అర్ధరాత్రి ఒంటి గంటకు నిలిచిపోయిన విద్యుత్ సరఫరా తెల్లవారుజాము 5.18ని.లకు పునరుద్ధరించబడింది. సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు తీవ్ర విద్యుత్ అంతరాయం ఏర్పడంతో ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొందరైతే ఏకంగా జాగరణ చేశారు. శనివారం ఉదయం నుంచి కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతూనే ఉంది. కాగా ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ తలెత్తలేదని ప్రజలు వాపోతున్నారు. అయిజ-గట్టు మధ్య 33కేవీ విద్యుత్ లైన్‌లో ఏర్పడ్డ సాంకేతిక సమస్యల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. మొత్తం మీద కరెంట్ కష్టాలతో ప్రజలు బెంబేలెత్తిపోయారు.

నాణ్యమైన విత్తనాలే కొనాలి

● దళారుల చేతుల్లో మోసపోవొద్దు
● జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోష్
● జిల్లావ్యాప్తంగా విత్తనాల కొనుగోలుపై అవగాహన సదస్సులు

గద్వాల రూరల్, మే 25 : రైతులు నాణ్యమైన, అధిక దిగుబడినిచ్చే విత్తనాలను డీలర్ల వద్ద కొనుగోలు చేసి రసీదులు తీసుకోవాలని కలెక్టర్ బీఎం సంతోష్‌కుమార్ సూచించారు. మండలంలోని చెనుగోనిపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తనాల కొనుగోలులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు శనివారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయశాఖ గుర్తింపు పొందిన డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు సమయంలో సంబంధిత కంపెనీ లేబుల్ పరిశీలించాలని, నకిలీని అరికట్టడానికి కవర్లు అలానే పంట కాలం పూర్తయ్యే వరకు ఉంచుకోవాలన్నారు. ఎవరైనా దళారులు విత్తనాలు అమ్మితే తీసుకోవద్దని, అలా ఎవరైనా అమ్మితే సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి గోవిందర్‌నాయక్, ఏడీఏ సంగీతలక్ష్మి, ఏవో ప్రతాప్, ఏఈవోలు పాల్గొన్నారు.

ధ్రువీకరించిన విత్తనాలే కొనుగోలు చేయాలి

అలంపూర్, మే 25: రైతులు ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన విత్తన కంపెనీల విత్తనాలే కొనుగోలు చేసుకోవాలని, ఆఫర్లు, అడ్వర్టైజ్‌మెంట్లను చూసి పోసపోవద్దని ఏవో అనిత పేర్కొన్నారు. శనివారం మండలంలోని గుండిమల్ల, కోనేరు, అలంపూర్‌లో రైతులకు విత్తన కొనుగోళ్లపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గుర్తింపు ఉన్న అధీకృత విత్తన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు. విత్తన కొనుగోలు సమయంలో తప్పనిసరిగా రసీదు పొందాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు సాయిరాం, శిరీష, కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు కొని నష్టపోవొద్దు

అయిజ రూరల్, మే 25: రైతులు నకిలీ విత్తనాలు కొని నష్టపోవద్దని ఏవో శంకర్‌లాల్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని యాపదిన్నెలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన విత్తనాలను కొనుగోలు చేయాలని, రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో అరవింద్, రైతులు పాల్గొన్నారు.

విత్తన కొనుగోళ్లలో జాగ్రత్త వహించాలి

మల్దకల్, మే 25 : రైతులు నాణ్యమైన విత్తనాలను డీలర్ల వద్దే కొనుగోలు చేయాలని, విత్తన కొనుగోళ్లలో జాగ్రత్త వహించాలని ఏవో రాజశేఖర్ అన్నారు. మండలంలోని ఎల్కూర్ గ్రామంలో రైతులకు నాణ్యమైన విత్తన కొనుగోళ్లపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతు రైతులు విత్తనాలను గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని, అలాగే రసీదు తీసుకోవాలని, కంపెనీ లేబుల్ పరిశీలించి కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో కిశోర్‌కుమార్, ఖాజాభాషా, హారిక పాల్గొన్నారు.

వడ్డేపల్లి మండలంలో..

వడ్డేపల్లి, మే 25 : మండలంలోని జూలేకల్, కొంకలలో శనివారం ఏవో రాధ ఆధ్వర్యంలో విత్తనాల కొనుగోలు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఏవో మాట్లాడుతూ.. లూజుగా సంచుల్లో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయొద్దని, విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి రసీదు తీసుకోవాలని, పంటకాలం పూర్తయ్యేవరకు జాగ్రత్తగా దాచుకోవాలని, వ్యవసాయశాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో రవీందర్, రైతులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

పాన్‌గల్, మే25: రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వేణు హెచ్చరించారు. మండలకేంద్రంలో ఫర్టిలైజర్స్, సీడ్స్ షాపులను శనివారం ఎస్సై వేణు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఫర్టిలైజర్ షాపుల్లోని విత్తనాల వివరాలు, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అమ్మాలని సూచించారు. మండలంలో నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు.

నకిలీ విత్తనాలు అంటగడితే కఠిన చర్యలు

అయిజ రూరల్, మే 25: విత్తన దుకాణాల డీలర్లు రైతులకు నకిలీ విత్తనాలు అంటగడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో శంకర్‌లాల్ పేర్కొన్నారు. శనివారం వెంకటాపురం స్టేజీలో పెస్టిసైడ్స్, సీడ్స్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ నిల్వలను పరిశీలించారు. అనంతరం ఏవో మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని సూచించారు. ప్రభుత్వ అనుమతులు పొందిన విత్తన ప్యాకెట్లను విక్రయించాలని సూచించారు. కచ్చితంగా ఒరిజినల్ రసీదును ఇవ్వాలని చెప్పారు.

నకిలీ విత్తనాలు కొని నష్టపోవద్దు

రాజోళి, మే 25 : నకలీ విత్తనాలను కొని రైతులు నష్టపోవద్దని ఏఈవో ఇబ్రహీం అన్నారు. తూర్పుగార్లపాడులో రైతులకు విత్తనాల కొనుగోలులో చేపట్టాల్సిన జాగ్రత్తలపై శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు రాముడు, సైమన్, రామకృష్ణ,మద్దిలేటి, కురుమన్న, నాగన్న, రమేశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన కొనుగోళ్లపై రైతులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ సంతోష్

యాపదిన్నెలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

జూలేకల్‌లో రైతులతో మాట్లాడుతున్న ఏవో రాధ

ఎల్కూరులో రైతులతో మాట్లాడుతున్న ఏవో

స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఏవో శంకర్‌లాల్

నాసిరకం విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

● వనపర్తి కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

వనపర్తి, మే 25 : నాణ్యత లేని నాసిరకం విత్తనాలు, ఎరువులు రైతులకు కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో విత్తనాలు, ఎరువుల డీలర్లు, వ్యవసాయ అధికారులతో శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు లాభదాయక వ్యవసాయ చేసేందుకు వ్యవసాయ అధికారులు, డీలర్లు సరైన సలహాలు,సూచనలు ఇచ్చి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు వాడే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఆధారిత ఎరువులు, పచ్చరొట్ట, చెరువు మట్టి వంటి ఎరువులు అధికంగా వాడి భూసారం పెంచే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి డీలర్ల షాప్‌లో స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్ రైతులకు ఎరువుల సరఫరా రిజిస్టర్లు విధిగా నిర్వహించాలన్నారు. అనంతరం సదస్సులో జిల్లా వ్యవసాయశాఖాధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ దళారులు రైతుల వద్దకు వచ్చి తక్కువ ధరకు మేలు రకం విత్తనాలు ఇస్తామని ప్రచారం చేస్తుంటారని, ఇలాంటి వారిని రైతులు నమ్మవద్దని సూచించారు. విత్తన ప్యాకెట్స్ పై లేబుల్ లేకుండా ,ప్యాకింగ్ లేకుండా ఉన్న విత్తనాలను తీసుకొవద్దని ఎక్కడైనా ఇలాంటి వారు వస్తే వెంటనే కేసులు బుక్ చేయించాలన్నారు. ప్యాకెట్ సరిగ్గా లేకున్న లేబుల్స్‌లో తేడా కనిపించినా వెంటనే వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. బీటీ-3 పత్తి విత్తనాలను వాడకుండా చర్యలు తీసుకొవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, వ్యవసాయ ఏడీలు, ఏవోలు, ఏఈవోలు, డీలర్లు పాల్గొన్నారు.

వ్యవసాయ, డీలర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి

ధరణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశించారు. శనివారం స్థానిక ఆర్డీవో కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించి ధరణి దరఖాస్తుల పరిష్కారం పురోగతిని ఆన్‌లైన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాసీల్దార్లు ఆర్డీవో లాగిన్ వచ్చిన ధరణి దరఖాస్తులు క్షుణ్ణంగా అధ్యయనం చేసి ఎప్పటికప్పుడు కలెక్టర్ లాగిన్‌కు పంపించాలని, పెండింగ్‌లో పెట్టవద్దని సూచించారు.అదేవిధంగా కలెక్టరేట్ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో జిల్లాలో యాసంగి సీజన్ 2020-21, వానకాలం 2021-22లకు సంబంధించిన సీఎంఆర్ ధాన్యం ఎఫ్‌సీఐకి నిర్ణీత గడువులోపు అందించాలని మిల్లర్లను ఆదేశించారు. ధాన్యాన్ని ఎఫ్‌సీఐలకు సకాలంలో ఇవ్వనందున తీసుకున్న ధాన్యానికి సంబంధించి ప్రభుత్వానికి డబ్బులు జమ చేయాలని, లేకపోతే ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు. అలాగే 2022-23, 2023-24కు సంబంధించి మిల్లర్ల నుంచి ఇవ్వాల్సిన ధాన్యం యుద్ధ ప్రాతిపదికన ఎఫ్‌సీఐకి అందించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎం.నగేశ్, సివిల్ సప్లై అధికారి శ్రీనివాస్, మిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భూవివాదంపై కేసు నమోదు

ఉండవెల్లి, మే 25: కోర్టు అదేశాలను ఉల్లంఘించి ఇతరుల భూమిలోకి ప్రవేశించిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఘటన శనివారం చోటు చేసుకున్నది. ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండలంలోని ప్రాగటూర్‌కు చెందిన సుధామణికి తక్కశిల శివారులో సర్వేనంబర్ 338/అ1లో 6ఎకరాల 24కుంటల వ్యవసాయ భూమి ఉన్నది. ఈమే బావ వెంకటేశ్వరరెడ్డికి కూడా భూమి ఉన్నది. ఇరువురు భాగపరిష్కారం కోసం కోర్టును ఆశ్రయించగా సుధామణికి అనుకూలంగా ఇన్‌జక్షన్ ఆర్డర్ కాపీ వచ్చింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన వెంకటేశ్వరరెడ్డి ట్రాక్టర్‌తో సుధామణి భూమిని సాగు చేశాడు. దీంతో కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని సుధామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తేలిపారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

మదనాపురం, మే 25 : మండల కేంద్రంలోని భారీ ఆంజనేయ స్వామి విగ్రహ ద్వితీయ వార్షికోత్సవాన్ని శనివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విశిష్ట పూజలు చేశారు. పంచామృతాభిషేకాలు, జలాభిషేకాలు, అష్టోత్తర నామాలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ ఎంకే కుర్మన్న కుటుంబ సభ్యులు ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి రూ.లక్షా51వేలు విరాళం అందజేశారు. అదేవిధంగా కృష్ణకుమార్ అనే యువకుడు రూ.21 వేలు ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేశారు. ప్రధాన అర్చకుడు గోపిస్వామి విరాళం అందజేసిన దాతలను శాలువాలతో సన్మానించి స్వామివారి ప్రసాదం అందజేశారు.

ఉద్యోగుల బదిలీలు చేపట్టాలి

వనపర్తి టౌన్, మే 25 : వేసవి సెలవులు ముగిసే లోపే రాష్ట్రంలోని ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని బంజారా గిరిజన విద్యార్థి సమాఖ్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శివనాయక్ ప్రభుత్వాన్ని శనివారం ప్రకటనలో కోరారు. ముఖ్యమంత్రి విద్యా సంవత్సరానికి ఇబ్బందులు కలుకుండా బదిలీలు చేపట్టాలని ఆదేశించినప్పటికి అధికారులు చర్యలు తీసుకోకపోవడం చాలా బాధాకరమన్నారు. ఈసీ అనుమతితో వెంటనే రాష్ట్ర ఉద్యోగుల బదిలీలు తక్షణమే చేపట్టాలని లేకపోతే విద్యార్థి సంఘాలు, ఉద్యోగుల సంఘాలతో కలిసి తగు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ప్రభుత్వం స్పందించి బదిలీలు చేపట్టాలని కోరారు.

ప్రశాంతంగా యూజీ పరీక్షలు

వడ్డేపల్లి, మే 25 : పాలమూరు యూనివర్శిటీ పరిధిలో నిర్వహిస్తున్న యూజీ పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయి. శాంతినగర్‌లోని ఎల్ఎన్ఆర్ కళాశాలలో ఏర్పాటైన కేంద్రంలో శనివారం ఉదయం సెమిస్టర్ పరీక్షకు 185మంది విద్యార్థులకుగానూ 167మంది, మధ్యాహ్నం 175మంది విద్యార్థులకుగానూ 168 మంది విద్యార్థులు హాజరయ్యారని, 25మంది గైర్హాజైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ తెలిపారు.

ప్రజా చైతన్యంతోనే విప్లవం

అమరచింత, మే 25 : మార్క్సిజం, లేనిన్‌నిజం, మావో ఆలోచన విధానంతో ప్రజలను చైతన్యం చేస్తేనే కమ్యూనిస్టులు కోరుకున్న విప్లవం సాధ్యమవుతుందని సీపీఐఎంఎల్ ప్రజాపంథ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని మార్క్స్ భవనంలో రెండురోజులపాటు నిర్వహిస్తున్న సీపీఐఎంఎల్ మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. ఈ శిక్షణ తరగతులకు ప్రజాపంథ మాస్‌లైన్ వనపర్తి జిల్లా కార్యదర్శి అరుణ్‌కుమార్ అధ్యక్షత వహించగా మహబూబ్‌నగర్, గద్వాల్ జిల్లాల కార్యదర్శుల సీహెచ్ రాంచందర్, హన్ముంతు, మండల కార్యదర్శి రాజు, పట్టణ కార్యదర్శి రాజన్న పలువురు నాయకులు, ఉమ్మడి జిల్లాల కార్యకర్తలు ఉన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు కృష్ణ

దరఖాస్తులకు ఆహ్వానం

కొత్తకోట, మే 25 : కొత్తకోట సమీపంలో ఉన్న వీపనగండ్ల ఎస్సీ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల బాలుర ఫస్టియర్ ప్రవేశానికి మిగిలి పోయిన సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ దయాకర్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే పట్టణంలో ఉన్న ఎస్సీ బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఫస్టియర్ ప్రవేశానికి మిగిలిపోయిన సీట్ల కోసం పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 24 నుంచి 31వ తేదీ వరకు గురుకుల సొసైటీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు రుసుం రూ. 100 చెల్లించాలని వారు పేర్కొన్నారు.

ముగిసిన బీచుపల్లి బ్రహ్మోత్సవాలు

ఇటిక్యాల, మే 25: నడిగడ్డ ఇలవేల్పు బీచుపల్లి అంజన్న బ్రహ్మోత్సవాలు ముగిశాయి. చివరిరోజు శనివారం అర్చకులు ప్రహ్లాదాచారి, మారుతాచారి, సందీపాచారి, వాల్మీకి పూజారులు స్వామివారికి అమృతస్నానం, పంచామృత అభిషేకం, పల్లకీసేవ కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం కావడంతో స్వామివారికి కొత్తకుండలో కుడుములతో చేసిన నైవేద్యం(దాసంగాలు) సమర్పించేందకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. కార్యక్రమాలను ఆలయ ఈవో రామన్‌గౌడ్ పర్యవేక్షించారు.

కృష్ణానదిలో స్వామివారికి అమృతస్నానం చేయిస్తున్న అర్చకులు

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుషా

గద్వాల అర్బన్, మే 25 : జూన్ 8వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.కుషా పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో పోలీస్ అధికారులతో శనివారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజీ అయ్యే క్రిమినల్ కేసుల్లో ఇరువర్గాల వారిని రాజీ కుదిర్చి ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని పోలీసులకు సుచించారు. సమావేశంలో న్యాయమూర్తులు ఉదయ్ నాయక్, డీఎస్పీ సత్యనారాయణ, పీపీ త్రిపాఠి, ఏపీపీలు సృజన, భవాని, సీఐ భీంకుమార్, ఎస్సైలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి కుషా

అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఏవోకు ఫిర్యాదు

వడ్డేపల్ల